# సత్యవాక్కు

# the word of truth

క్రైస్తవ మాసపత్రిక

DECEMBER 1996

# కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్

## 12వ గొప్ప బైబిలు సెమినార్

### ఆహ్వానము.

తేదీలు : 1997 జనవరి 9నుండి 14వరకు
గురువారం సాయంత్రం నుండి మంగళవారం ఉదయం వరకు.

సమయం : ఉదయం 10, మధ్యా 3, సాయం 6 గంటలకు.

స్థలం : కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్
విద్యుత్ నగర్, కాకినాడ - 3.

ఉపన్యాసకులు : 1. జాన్ ఫోర్డ్, U.S.A
సోదరి. నాన్సీఫోర్డ్ (స్త్రీలకు ప్రత్యేక తరగతులు)
2. మరియు పలు భారతీయ సువార్తికులు.

ఈ కూటములకు పలురాష్ట్రములనుండి, ఆంధ్రాలో ప్రతిజిల్లానుండి వేలకొలది ప్రజలు ప్రతిసంవత్సరము హాజరగుచున్నారు. గొప్ప వర్తమానములు, మంచి క్రైస్తవగీతములు, గొప్ప సహవాసము అనుభవించుటకు ఇదొక మంచి తరుణం. దూరప్రాంతముల వారికి ఉచిత భోజన వసతి సౌకర్యము కలదు. మీరు తప్పకరండి. మీ కుటుంబాన్ని కూడా తీసికొని రండి. వివరములకు వెంటనే వ్రాయండి:

డైరక్టర్, కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్,
P.O. Box - 57, Kakinada - 1.
Ph: 0884 - 72604 / 64882.

# సత్యవాక్యం

**THE WORD OF TRUTH**

**P.o. Box 80, Kakinada, A.P. 533 001**

Phone : 0884-63722

**Editor :** **Managing Editor :**

**J.C.CHOATE** **JOSHUA GOOTAM**

**Pleading for Restoration of First Century Christianity**

సంపుటి 17 డిశంబరు 1996 సంచిక 5


## సంపాద కీయం

### "ఖడ్గమునే గాని సమాధానమును పంపుటకు నేను రాలేదు"

( **"I came not to send peace, but a sword"** )

మెస్సీయ సమాధానకర్తయగు అధిపతియని పిలువబడునని యెషయా ప్రవచించాడు (యెషయా 9:6). మెస్సీయ (రక్షకుడు) అయిన యేసుక్రీస్తు, "నేను భూమి మీదికి సమాధానమును పంప వచ్చితినని తలంచకుడి; ఖడ్గమునే గాని సమాధానమును పంపుటకు నేను రాలేదు. ఒక మనుష్యునికిని వాని తండ్రికిని, కుమార్తెకును ఆమె తల్లికిని, కోడలికిని ఆమె అత్తకును విరోధము పెట్టవచ్చితిని. ఒక మనుష్యుని యింటివారే అతనికి శత్రువులగుదురు. తండ్రినైనను, తల్లినైనను నాకంటె ఎక్కువగా ప్రేమించువాడు నాకు పాత్రుడుకాడు; కుమారునినైనను, కుమార్తెనైనను నాకంటె ఎక్కువగా ప్రేమించువాడు నాకు పాత్రుడుకాడు" అని చెప్పెను (మత్తయి 10:34-37).

యేసుక్రీస్తు సమాధానకర్తయగు అధిపతియని చెప్పుటలోను, సమాధానమును కాదు గాని ఖడ్గమునే పంపవచ్చితినని ఆయన చెప్పుటలోను స్వవిరుద్ధ సంగతియేమీ లేదు. ఆయన ఏలాగోలాగున శాంతిని నెలకొల్పుటకు రాలేదు. ఒక కుటుంబములోని సభ్యులందరు ఆయన బోధనంగీకరించిన యెడల అట్టికుటుంబాలకు ఆయన శాంతిననుగ్రహించును. అయితే అదేకుటుంబములో కొందరు ఆయన నంగీకరించి, మరికొందరు ఆయనను నిరాకరించిన యెడల ఆ కుటుంబములో శాంతికాదు గాని ఖడ్గముండును. బహుశ యేసుయొక్క ఉద్దేశమిదియే.

## వ్యక్తిగత సమాధానము

యేసుప్రభువు ద్వారా ప్రతివాడు దేవునితో శాంతి, సమాధానమును కలిగి యుండగలడు గనుక ఆయన సమాధానకర్తయగు అధిపతియే. "కాబట్టి విశ్వాస మూలమున మనము నీతిమంతులముగా తీర్చబడి, మన ప్రభువైన యేసుక్రీస్తు ద్వారా దేవునితో సమాధానమును కలిగియుందము" (రోమా 5:1).

ఒకడు క్రీస్తును వెంబడించినందు వలన విరోధులను కలిగియుండినను, యేసుక్రీస్తు ద్వారా దేవునితో అతడు వ్యక్తిగత సమాధానము కలిగియుండగలడు. ఇట్టి దేవుని సమాధానము క్రైస్తవుల హృదయములను ఏలుచుండవలెను. కొలస్స యలోని క్రైస్తవులకు వ్రాయుచు పౌలు, "క్రీస్తు అనుగ్రహించు సమాధానము మీ హృదయములలో ఏలుచుండనియ్యుడి; ఇందుకొరకే మీరొక్క శరీరముగా పిలువ బడితిరి; మరియు కృతజ్ఞులై యుండుడి" యని చెప్పాడు (కొలస్స 3:15).

ఆ ఒక్క శరీరమే సంఘమని పౌలు కొలస్సయలోని క్రైస్తవులకు చెప్పాడు. క్రీస్తును గూర్చియు, ఆయన శరీరమును గూర్చియు వ్రాస్తు, "సంఘము అను శరీర మునకు ఆయనే శిరస్సు; ఆయనకు అన్నిటిలో ప్రాముఖ్యము కలుగు నిమిత్తము ఆయన ఆదియై యుండి మృతులలో నుండి లేచుటలో ఆది సంభూతు డాయెను" అని పౌలు చెప్పాడు (కొలస్స 1:18). దీనంతటి అర్థమేమంటే క్రీస్తు శరీర మైన క్రీస్తు సంఘములో యున్న ప్రతివాని హృదయము లోను వ్యక్తిగత సమాధానము ఏలుచుండును.

# యూదులకు అన్యులకు సమాధానము

క్రీస్తు రాకముందు యూదులకు అన్యులకు మధ్య శత్రుత్వముండేది. దీనిని గూర్చి పౌలు ఇట్లు వ్రాసాడు: "కాబట్టి మునుపు శరీర విషయములో అన్యులై యుండి, శరీరమందు చేతితో చేయబడిన సున్నతి గలవారు అనబడిన వారిచేత సున్నతిలేని వారనబడిన మీరు, ఆ కాలమందు ఇశ్రాయేలుతో సహపౌరులు కాక, పరదేశులును వాగ్దాన నిబంధనలేని పరజనులును, నిరీక్షణలేని వారును, లోకమందు దేవుడులేని వారునైయుండి, క్రీస్తుకు దూరస్థులై యుంటిరని మీరు జ్ఞాపకము చేసి కొనుడి. అయినను మునుపు దూరస్థులైన మీరు ఇప్పుడు క్రీస్తుయేసు నందు క్రీస్తు రక్తము వలన సమీపస్థులై యున్నారు. ఆయన మన సమాధానమై యుండి మీకును, మాకును ఉండిన ద్వేషమును, అనగా విధిరూపకమైన ఆజ్ఞలుగల ధర్మ శాస్త్రమును తన శరీరమందు కొట్టివేయుటచేత మధ్యగోడను పడగొట్టి మన ఉభయులను ఏకము చేసెను. ఇట్లు సంధిచేయుచు, ఈ యిద్దరిని తన యందు ఒక్క నూతన పురుషునిగా సృష్టించి, తన సిలువవలన ఆ ద్వేషమును సంహరించి, దాని ద్వారా వీరిద్దరిని ఏకశరీరముగా చేసి, దేవునితో సమాధాన పరచవలెనని యీలాగు చేసెను గనుక ఆయనయే మనకు సమాధాన కారకుడై యున్నాడు. మరియు ఆయన వచ్చి దూరస్థులైన మీకును సమీపస్థులైన వారికిని సమాధాన సువార్త ప్రకటించెను" (ఎఫెసీ 2:11-17).

ఇందులో దూరస్థులు అన్యజనులును, సమీపస్థులు యూదులునై యున్నారనుట విదితమే. యేసుక్రీస్తు మోషే ధర్మశాస్త్రమును సిలువలో కొట్టివేయుట చేత, యూదులకు అన్యజనులకు మధ్యనున్న గోడను పడగొట్టెను. మరియు యూదులు, అన్యులు క్రీస్తుద్వారా దేవునిలో ఏకశరీరమవుటకు కారకుడాయెను. గనుక ఆయన నిశ్చయముగా మనకు సమాధానకర్తయగు అధిపతి ఆయెను. ఆశరీరమే ఆయన సంఘము. గనుక క్రీస్తు నెలకొల్పిన సమాధానము ఆయన సంఘములోనే సాధ్యమగునని కూడ గ్రహింపగును.

# భేదములు గందరగోళము కాదు

శాంతి సమాధానములకు కర్తఅయిన క్రీస్తు ఆధ్యాత్మిక భేదములను గందర గోళమును సృజించుటకు చనిపోలేదు. సరిగదా యూదులను అన్యజనులను, ఆయన సంఘమైన శరీరమందు ఏకపరచుట కాయన చనిపోయెను. దీనిని సిలువద్వారా రక్షణయని పౌలు వివరించాడు. సంఘరక్షణ కాదు, సిలువ రక్షణ కావాలని కొందరు అంటారు. అయితే పైనచూచిన ఎఫెసీ 2:16లో సిలువ ద్వారా రక్షణ ఆ ఒక్క శరీర మందే యున్నట్లు పౌలు చెప్పాడు. క్రీస్తుయొక్క ఆ ఒక్క శరీరమే క్రీస్తు సంఘము.

ఒకనికి యిదంతయు తెలిసియుండినను, ఆ ఒక్క శరీరములోనికి ప్రవేశించుట యెట్లో తెలిసియుండకపోతే, అతడింకను రక్షింపబడినవాడు కాదు. అందువలననే ఒకడు క్రీస్తునందు విశ్వసించవలెను, తన పాపముల విషయమై మారుమనస్సు పొందవలెను. మరియు తన విశ్వాసమును ఒప్పుకొని క్రీస్తులోనికి, ఆయన శరీరమైన సంఘములోనికి పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందవలెను (మార్కు 16:15,16; అపొ.కా. 2:38).

యేసు తన సిలువ ద్వారా సాధించిన సమాధానము కొరకు ప్రార్థించెను: "మరియు నీవునన్ను పంపితివని లోకము నమ్మునట్లు, తండ్రీ నాయందు నీవును, నీయందు నేనును ఉన్నలాగున, వారును మనయందు ఏకమై యుండవలెనని వారికొరకు మాత్రమునేను ప్రార్థించుటలేదు; వారి వాక్యము వలన నాయందు విశ్వాసముంచు వారందరును ఏకమై యుండవలెనని వారికొరకును ప్రార్థించు చున్నాను" (యోహాను 17:20-21). యేసు ఇక్కడ అపొస్తలుల కొరకు ప్రార్థించెను. యేసువారికి దేవుని వాక్యము ననుగ్రహించెను (యోహాను 17:8, 14). అందువలన వారి వాక్యము దేవుని వాక్యము. యేసు తన అపొస్తలుల కిచ్చిన వాక్యము ద్వారా విశ్వాసులైన వారందరు ఏకమై యుండవలెనని, వారు తండ్రి కుమారుల ఏకత్వమును కలిగియుండాలని ప్రార్థించెను. ఈ ఏకత్వము కొరకే సమాధానకర్తయగు అధిపతి మరణించెను.

- బేసిల్ ఓవర్టన్

## "వీరు ఓడలో యుంటేనేగాని మీరు తప్పించుకొనలేరు"

("Except these abide in the Ship ye can not be saved")

కైసరు చక్రవర్తి యెదుట తన విజ్ఞాపనను విన్నవించు కొందునని పౌలు చెప్పినప్పుడతడు రోమాకు కొనిపోబడెను. వారు ఓడలో ప్రయాణము చేయుచుండగా రాబోవు ప్రమాదమును గూర్చి పౌలు తనను బంధించి యున్నవారికి హెచ్చరిక చేసెను (అపొ.కా. 27:10). తరువాత వారొక పెనుతుఫానును ఎదుర్కొన్నప్పుడు, "ఓడకేగాని మీలో ఎవని ప్రాణమునకు హానికలుగదు" అని అతడు వారికి ధైర్యము చెప్పెను (అపొ.కా. 27:22). అయితే ఓడ బద్దలుకాక మునుపు ఓడను దానిలోనున్న వారిని విడిచి పారిపోవలెనని నావికులు జూచిరి. "అందుకు పౌలు - వీరు ఓడలో ఉంటేనే గాని మీరు తప్పించు కొనలేరని శతాధిపతితోను సైనికులతోను చెప్పెను" (అపొ.కా. 27:31). నావికులు తప్పించుకొని పోకుండా సైనికులు వారిని ఆపిరి. ఆ మరునాడు ఓడ బద్దలాయెను. ఓడయును, అందున్న సామగ్రి అంతయును నాశన మాయెను గాని ఓడలోనున్న వారందరు మాత్రము రక్షింపబడిరి (తప్పించుకొనిరి).

జలప్రళయము నందున్న ప్రజలందరికీ సురక్షిత స్థలముగా నోవహు ఓడను నిర్మించెను. వారు ఓడలో యుంటేనే గాని వారికి రక్షణ లేకపోయెను. మనకు కూడ అదే సంగతి వర్తించును. సురక్షిత స్థానములో యుంటేనే గాని నేడు మనకు కూడ రక్షణలేదు.

నోవహు నిర్మించిన రక్షణ ఓడనొకసారి గమనించి దానినుండి యేమి మనం నేర్చుకోగలమో గమనింతము. ఆ రక్షణ స్థావరమును మానవుడు కాదుగాని, దేవుడే సంకల్పించెను. ఓడను నిర్మించాలని నోవహు కాదుగాని దేవుడే తలంచాడు. ఓడ ఎందుకు? వేరొకటి నిర్మించబడవచ్చుకదా యని నోవహు తన అభిప్రాయాన్నేమీ వెళ్ళబుచ్చలేదు. దేవుని నిశ్చయతను అతడు ప్రశ్నించలేదు, హేళన అంతకుముందే చేయలేదు. అతడు దాని నంగీకరించాడు, దేవుని షరతులన్నిటికీ యావత్తు విధేయత చూపాడు (ఆది.కా. 6:22). నోవహుకు ఎందుకో తెలియలేదు, దేవుడు చెప్పాడని మాత్రం అతనికి తెలుసు. అదే అతనికి చాలును.

అయితే నోవహు చేసిన బోధను లోకము వినలేదు. అతడంత కష్టపడి ప్రకటించినా, కేవలం ఎనిమిది మంది మాత్రమే రక్షించబడిరి. ఎవరైతే రక్షణ స్థావరములో ప్రవేశించారో, వారినే దేవుడు రక్షించెను. ఈ విషయంలో ఆయన చిత్తము ఎన్నడు మార్పుజెందకుండా దేవుడు సంకల్పించాడు.

ఓడయొక్క తలుపును దేవుడే మూసేసాడు (ఆది.కా. 7:15-16). మీకు ఇష్టమున్నను, లేకపోయినను సరే, దేవుడు నీతిమంతులను దానిలో యుంచి తలుపును మూసివేసినప్పుడు, అనీతిమంతులను, మారుమనస్సు లేని వారిని బయట బంధించేసాడు! ఆనాటి భక్తిహీనులు వారికి జరుగుచున్నదేమిటో గ్రహించుకొనేసరికి వారికి ఆలస్యమై పోయింది. ఓడకు వెలుపల యుండి భద్రత కొరకు ఎవరును దానికి వ్రేలాడలేక పోయారు. ఏలయనగా ఓడలో యున్నవారు 382 రోజుల తరువాత ఆరిన నేలపై అడుగు పెట్టగలిగారు (ఆది.కా. 7:11; 8:14).

ఓడలో యున్నవారు చివరివరకు దానిలోనే యుండాల్సివచ్చినది. రక్షింప బడాలంటే ఎవరైనా ఓడలోనే యుండాలి, ఏలయనగా ఓడకు వెలుపల ఎవనికిని రక్షణలేదు. నేడు మనకు కూడ రక్షణ ఓడ యొకటి ఉన్నది (ఎఫెసీ 5:23; అపొ.కా. 2:47). క్రీస్తు సంఘములో యున్నవారు రక్షింపబడగల్గునట్లు సంఘముకొరకు క్రీస్తు చనిపోయెను. క్రీస్తు రక్తము మన విమోచన క్రయధనముగా సంఘముకొరకు అర్పింపబడెను (అపొ.కా. 20:28).

మానవుని రక్షించుటకు సంఘమును ఏర్పాటు చేసింది దేవుడే (మత్తయి 16:18; ఎఫెసీ 3:10-11). ఈ రక్షణ స్థావరములోనికి ప్రవేశము దేవుని షరతులకు లోబడితేనే కలుగును. రక్షణ ఓడయగు సంఘములోనికి బాప్తిస్మము మనలను ప్రవేశింప జేయును. అందువలన బాప్తిస్మము మనలను రక్షించును (1పేతురు 3:21; రోమా 6:3-4, 22-23). ఈ రక్షణ ఓడలోనికి ప్రవేశింపజేసే షరతులను మనము మార్చకూడదు, మార్చజాలము. నోవహు ఓడవలెనే భద్రతా స్థావరములో యున్నవారిని మాత్రమే దేవుడు రక్షించును. ఆ రక్షణ స్థావరమే క్రీస్తు సంఘము.

రక్షణ స్థావరమగు ఓడలో, సంఘములో నీవున్నావా? నీవు క్రీస్తులోనికి ఆయన సంఘములోనికి ప్రవేశించునట్లు లేఖనముల ప్రకారము బాప్తిస్మము నొందావా?

ముంచడము ద్వారా నీవు బాప్తిస్మము పొందకపోతే అది లేఖనముల ప్రకారమైనది కాదు. అది కాని ప్రయోజనమునకు పొందితే లేఖనముల ప్రకారమైనది కాదు. దానిద్వారా నీవు మతశాఖలో ప్రవేశించితే అది సరియైన బాప్తిస్మముకాదు. దానిని పొందకముందే రక్షింపబడితినని తలస్తు బాప్తిస్మము తీసికొంటే అది సరియైనది కాదు.

రక్షణ ఓడలోనికి ప్రవేశించిన తరువాత నీవు దానిలో నిలిచియుండాలి (మత్తయి 10:22; లూకా 9:62, ప్రకటన 2:10). నోవహు ఓడలోనికి ప్రవేశించిన ఎనిమిది మందిలో ఎవరైనా సమయం రాకముందే దానిని విడిచి బయటకు రావాలని ఎందుకు కోరుకోవాలి? ఆలాగే ఈ రోజుకూడ రక్షణ స్థావరమైన క్రీస్తు సంఘములో యున్నవారెవరైనను అంతమువరకు దానిలోనే యుండాలని ఎందుకు కాంక్షించరు?

- గేరీ స్టాంటన్
(Contending for the Faith )

## హఠాత్తుగా వచ్చునవి

మనజీవితంలో కొన్ని సంగతులు హఠాత్తుగాను, కొన్ని నిదానముగాను, సంభవించును. అవిఏమిటో తెలుసుకొందాం:

1. మరణం: ఎప్పుడైనా మరణము చెప్పిరాదు, ప్రమాదాలుకూడా చెప్పిరావు. పేపరులోను, టీవీలోను, ఈలాంటి ప్రమాదకార్యములను గూర్చి రోజూ వినుచున్నాము, చదువుచున్నాము కాబట్టి బైబిలుకూడా ఈ విధముగా బోధిస్తుంది: "రేపేమి సంభవించునో మీకు తెలియదు. మీజ్ఞానమేపాటిది? మీరు కొంతసేపుకనబడి అంతలోమాయమై పోవు ఆవిరివంటివారే" అని యాకోబు 4:4లో వ్రాయబడింది. కాబట్టి మనము జాగ్రత్తకలిగి మరణమునకు సిద్ధపడాలి.

నాకు ఒక డాక్టరు గారు బాగాతెలుసు. మంచి ఆరోగ్యముగా ఉంటారు. మంచి హాస్పటల్ కూడా ఉంది. నెలకు 3,4సార్లు వెళ్ళి ప్రార్ధన జరిగిస్తూ ఉండేవాడను. అయితే నాకు విరామము లేక రెండువారాలు వెళ్ళలేదు. అటు తరువాత వెళ్ళాను. డాక్టరుగారు కనిపించలేదు. వారిభార్యను అడిగాను. కంటతడి పెట్టింది. ఏమిటి అనిఅడుగగా, డాక్టరుగారు ఇకలేరు. పోయినవారం చనిపోయారు. అనిచెప్పగా, నాకు చాల భయం వేసింది. నేను కూడ తెలియకుండా హఠాత్తుగా మరణించవచ్చునన్న తలంపు ఏర్పడింది. సొలోమోను మహారాజు ఈలావ్రాస్తున్నాడు: "తమ కాలం ఎప్పుడు వచ్చునో నరులు ఎరుగరు; చేపలు బాధకరమైన వలలో చిక్కు బడునట్లును, పిట్టలు వలలో పట్టుబడునట్లును, అశుభకాలమున హఠాత్తుగ తమకు చేటుకలుగు నప్పుడు వారును చిక్కుబడుదురు" (ప్రసంగి 9:12).

ప్రియమిత్రుడా, నీవు ఈరోజున బ్రతికేఉన్నావు. కాబట్టి నీజీవితమును మార్చుకొనమని ప్రభువు చెప్పుచున్నారు. మార్చుకొనకపోతే నశిస్తావ్ (లూకా 13:3). నేను బాగుగానే ఉన్నానని గర్వించక, జాగ్రత్తపడి, క్రీస్తునునమ్మి, బాప్తిస్మముపొంది, రక్షింపబడుము.

**2.** క్రీస్తురాకడ: ప్రభువుకూడా తెలియకుండా దొంగవలె హఠాత్తుగా వస్తానని చెప్పుచున్నారు. నోవహు దినాలలో, జనులు, తినుచు, త్రాగుచు, పెళ్ళిఆడుచు, పెళ్ళికియ్యబడుచూ ఉండగా జలప్రళయం వచ్చి వారిని నాశనం చేసింది (లూకా 17:26,27). అలాగే ఈరోజుల్లో కూడా క్రీస్తు సువార్త రేడియోలోను, పుస్తకాల ద్వారా, బోధకుల ద్వారా వినిపిస్తున్నా వినకుండా పెడచెవిని పెట్టి ప్రవర్తిస్తుండగా, ప్రభువు రాకడ ఇప్పుడే వస్తే నరకంలో ఉంటావో లేక పరలోకం వెళ్తావో నిర్ణయించుకొనుము.

ప్రియమిత్రుడా, హఠాత్తుగా సంభవించు మరణమైనను, ప్రమాదమైనను, క్రీస్తురాకడైనను నీవు ప్రభువులో జీవిస్తుంటే భయపడక్కరలేదు. లేనియెడల ఇప్పుడే సిద్ధపడి, క్రీస్తునందు విశ్వసించి, మారుమనస్సు పొంది, క్రీస్తును నోటితో ఒప్పుకొని పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందుము. అప్పుడు నీవు భయపడక్కరలేదు.

- **M .** ఫిలిప్. భారతీపేట, గుంటూరు

## పరలోకరాజ్యము యొక్క విలువ
## (మత్తయి 13:44-66)
## (The Value of the Kingdom)

దేవునిరాజ్యమును ఎవరైతే కనుగొంటారో ఆ మనుష్యులు అమూల్యమైన ముత్యమును కనుగొందురు.

### దాచబడిన ధనము , అమూల్యమైన ముత్యము

ఈ ఉపమానములు సంక్షిప్తమైనవి మరియు సాధారణమైనవి కాని శక్తివంతమైనవి. మొదటి ఉపమానములో ఒక మనుష్యుడు పొలములో దాచబడిన ధనమును కనుగొని దాచిపెట్టి, తనకు కలిగినదంతయు అమ్మి ఆ పొలమును కొనుటకు వెళ్ళెను. ఆరోజులలో తమ ఆస్థిని సురక్షితముగా కాపాడుకొనుటకు దానిని పొలములో దాచిపెట్టెడివారు. అలా దాచిన వ్యక్తి చనిపోయినయెడల ఆ సంపదను గూర్చి ఎవరికిని తెలియకపోవును కొంతమంది ధనాన్ని అట్లు దాచి పెట్టుటను అనైతికముగా భావిస్తారు.

రెండవ ఉపమానములో వర్తకుడు మంచి ముత్యములను కొనవెదకుచున్నాడు. అతడు అమూల్యమైన ముత్యమును ఎప్పుడైతే కనుగొన్నాడో అప్పుడు అతడు దానిని కొనుటకు తనకున్న సమస్తమును అమ్మివేసెను. పొలములో దాచబడిన ధనమును కనుగొన్న వ్యక్తికూడా ఈ మాదిరిగానే తనకున్న సమస్తమును అమ్మివేసాడు కాని అతడు ఆపనిని అకస్మాత్తుగా చేసాడు. కాని ఈ వర్తకుడు విలువైన ముత్యముల కొరకు చూస్తున్నట్లు అతనికి తెలుసు.

సత్యమును ఆకస్మికముగా లేక ఉద్దేశపూర్వకముగా కూడా కనుగొనగలము. సత్యమును ఆకస్మికముగా కనుగొనుటకు ఉదాహరణ సమరయస్త్రీ. మరియు సత్యమును ఉద్దేశపూర్వకముగా కనుగొనుటకు ఉదాహరణ ఐతియోపీయుడైన నపుంసకుడు (యోహాను 4. అపొ.కా. 8). ఎవరు ఏవిధముగా సత్యమును కనుగొన్నప్పటికి దాని శక్తిని గుర్తించగలిగిన వారమై యుండాలి. మరియు దానిని పొందుటకు సమస్తమును విడిచిపెట్టాలి.

## అతి అమూల్యమైన పరలోరాజ్యము మనలను సమస్తము సమర్పించుటకు పిలుచుచున్నది

దేవునిరాజ్యము మనము కల్గియున్నయెడల అది సమస్తము కంటే చాలా విలువైనది.,దాని విలువ యేసు తన స్వరక్తమిచ్చి సంపాదించి కొన్న విలువలో చూపబడినది (అపో 20:28). "ఒకడు ఆస్తినంతయు సంపాదించుకొని తన ఆత్మను పోగొట్టుకొంటే వానికేమి ప్రయోజనము" అనుదానిని పోల్చుకొనుటలో ఆ రాజ్యపు విలువ కన్పించును (మత్తయి 16:24).

ఒకడు రాజ్యముయొక్క నిజమైన విలువను గ్రహించినట్లయిన దానిని వెదకుటకు ఇతరులను ప్రోత్సహించుటకు తన జీవితములో ప్రాధాన్యతను ఇచ్చును. "కాబట్టి మీరు ఆయన రాజ్యమును నీతిని మొదట వెదకుడి అప్పుడవన్నియు మీకను గ్రహింపబడును" (మత్తయి 6:33). ఏకైక దేవుని వెంబడించుటవల్ల కల్గు ప్రాముఖ్యతను ప్రభువు గమనించాడు. ఎందుకనగా ఒకడు ఇద్దరు యజమానులకు దాసునిగా యండుటవలన తృణీకరింపబడును (మత్తయి 6:24).

ఒకడు రాజ్యము యొక్క నిజమైన విలువను ఒకసారి గుర్తించిన ఎడల దానిని పొందుటకు గాఢమైన కోరికను కల్గియుండును. నిజానికి తన జీవితములో ఆ రాజ్యమును పొందుటకు తనకున్న సమస్తమును త్యాగము చేయును (మత్తయి 16:24, 25). యూదులలో అతి నిష్ణాతుడనని పౌలు తనను గూర్చి వర్ణించుకొనెను. "అయినను ఏవేవి నాకులాభకరమై యుండెనో వాటిని క్రీస్తు నిమిత్తము నష్టముగా ఎంచుకొంటిని" అని చెప్పెను (ఫిలిప్పీ 3:7, 8). కాబట్టి రోమాలో ఉన్న సహోదరులను ఈవిధముగా బతిమాలెను: "దేవునికి అనుకూలమైన సజీవయాగముగా మీశరీరములను సమర్పించుకొనుడి -ఉత్తమమును అనుకూలమును సంపూర్ణమునైన దేవుని చిత్తమేదో పరీక్షించి తెలిసికొనునట్లు మీ మనస్సు మారి నూతనమగులవలన రూపాంతరము పొందుడి" (రోమా 12:1,2).

## రాజ్యమును పొందుటలో గల ఆనందము

దాచబడిన ధనమును కనుగొన్న వ్యక్తి విశేషముగా ప్రతిస్పందించును. ఆ మిక్కుటమైన సంతోషములో అతడు వెళ్ళి తనకున్నదంతయు అమ్మి ఆ పొలమును కొనును. పౌలు క్రీస్తు యొక్క సంఘములో భాగముగా యుండుటకు తనకున్న సమస్తమును విడిచిపెట్టినట్లుగా మనము చూచియున్నాము. అందుచేతనే పౌలు ఫిలిప్పీ 4:4లో ఈవిధముగా వ్రాసెను: "ఎల్లప్పుడు ప్రభువునందు ఆనందించుడి. మరల చెప్పుదును ఆనందించుడి". "దీనస్థితిలో ఉండ నెరుగుదును సంపన్న స్థితిలో ఉండనెరుగుదును. ప్రతివిషయములోను, అన్ని కార్యములలోను కడుపునిండి యుండుటకును లేమిలో ఉండుటకును నేర్చుకొని యున్నాను. నన్ను బలపరచు వానియందే నేను సమస్తమును చేయగలను" (ఫిలిప్పీ 4:10-13). అమూల్యమైన దానిని అతడు కనుగొనుట చేత ఒకడు తనకున్నదంతయు అర్పించుటలో ఆనందమును పొందగలడు.

యేసుచెప్పిన ఉపమానములోని ముత్యముల వ్యాపారి మన ఆంతరంగిక ఆనందమునకు మూలాధారముగా యున్నాడు. అతనికి ఒక ఉద్దేశము కలదు. ఆ ఉద్దేశమునకు తగిన వస్తువు దొరికినప్పుడు అతడు తనక్కున్నదంతయు అమ్మి ఆ ముత్యమును పొందెను (ఫిలిప్పీ 3:13,14తో పోల్చుము). అటువంటి ఆంతరంగిక ఆనందము మనము పొందినట్లయిన పరలోక గురివైపునకు మనము కేంద్రీకరింప బడుదుము. ఐతియోపీయుడైన నపుంసకుని వలె దేవుని చిత్తమును కనుగొన్నవారు దానికి విధేయత చూపుటకు వెనుకాడరు. ఒకడు అట్టి అనుభవమును పొందినట్లయిన అతడు ఆయానంద మార్గములో పయనించును (అపో 8:26-39).

-గేరీ హేంప్టన్ (VOT)

# ప్రభువు ప్రార్థనను ప్రోత్సహించెను

**(THE LORD ENCOURAGED US TO PRAY)**

**(మత్తయి 7:6-12)**

యేసుప్రభువు కొండమీద చేసిన ప్రసంగములో రెండు మారులు ప్రార్థనను గూర్చి చెప్పారు. మొదటి సందర్భము మత్తయి 6:5-15లోను, రెండవ సందర్భము మత్తయి 7వ అధ్యాయములోను రికార్డు చేయబడియున్నది. మొదటి సందర్భములో మనం ఎట్లు ప్రార్థన చేయాలో ఆయన నేర్పించారు. అక్కడ ఒక మాదిరి ప్రార్థన కూడ ఆయన తన శిష్యులకు నేర్పించారు. 7వ అధ్యాయములో మనం దేవుని అడగాలని ఆయన ప్రోత్సహించారు. మనం అడగాలని, వెదకాలని, తట్టాలని ఆయన బోధించారు. ఆయన ఇట్లు చెప్పారు:

"పరిశుద్ధమైనది కుక్కలకు పెట్టకుడి; మీ ముత్యములను పందుల యెదుట వేయకుడి; వేసిన యెడల అవి యొకవేళ వాటిని కాళ్ళతో త్రొక్కి మీ మీద పడి మిమ్మును చీల్చివేయును.

"అడుగుడి మీకియ్యబడును, వెదకుడి మీకు దొరుకును, తట్టుడి మీకు తీయబడును. అడుగు ప్రతివాడును పొందును, వెదకు వానికి దొరకును, తట్టువానికి తీయబడును. మీలో ఏమనుష్యుడైనను తన కుమారుడు తన్ను రొట్టెను అడిగిన యెడల వానికి రాతినిచ్చునా? చేపను అడిగిన యెడల పామునిచ్చునా? మీరు చెడ్డవారై యుండియు మీ పిల్లలకు మంచి యీవులనీయ నెరిగియుండగా పరలోకమందున్న మీ తండ్రి తన్ను అడుగు వారికి అంతకంటె నిశ్చయముగా మంచి యీవుల నిచ్చును. కావున మనుష్యులు మీకు ఏమి చేయవలెనని మీరు కోరుదురో ఆలాగుననే మీరును వారికి చేయుడి. ఇది ధర్మశాస్త్రమును ప్రవక్తల ఉపదేశమునై యున్నది" (మత్తయి 7:6-12).

దేవుని సింహాసనము నొద్దకు ప్రవేశించవలెనని ప్రభువు మనలను ఆహ్వానించు చున్నాడు. దేవుడు మన తండ్రియై యున్నాడు. అందువలన ఆయన బిడ్డలమైన మననుండి ఆయన వినాలని కాంక్షించుచున్నాడు.

ఇంతకు ముందు సందర్భాల్లో మనం ఎట్లు ఇవ్వాలో ప్రభువు బోధించారు. ఇప్పుడు అడుగుటను గూర్చి ఆయన బోధించారు.

## అడుగుడి, వెదకుడి, తట్టుడి

మనం ప్రార్థన చేయునప్పుడు అడుగుతాము; దేవుని అడుగుతాము. ఆయన మనకు యిచ్చేటట్లు బలవంతము చేయుటకు కాదుగాని, మనం అడుగువాటిని పొందుటకు గాను అడుగుడి మీకియ్యబడును అని ఆయన చెప్పారు. మనకేదైతే లోటుగా వున్నదో దానిని గూర్చి అడుగుదుము. మన అవుసరముల నిమిత్తమును, మన పొరుగువారి అవుసరముల నిమిత్తమును దేవుని అడగాలి. "మీరు చెడ్డవారై యుండియు, మీపిల్లలకు మంచి యీవుల నియ్య నెరిగి యుండగా, పరలోకమందున్న మీతండ్రి తన్ను అడుగువారికి పరిశుద్ధాత్మను ఎంతో నిశ్చయముగా అను గ్రహించునని" ప్రభువు చెప్పారు (లూకా 11:12,13). మనం హృదయపూర్వకముగా అడగాలి.

తరువాత "వెదకుడి మీకు దొరుకును" అని ప్రభువు చెప్పారు. మనం ఆయన మన కొరకై దాచియుంచిన ఆత్మీయ వాగ్దానముల ఐశ్వర్యమును వెదకాలి. మనం దేనినైనా కోల్పోయినప్పుడే వెదుకుదుము గదా. పాపంచేసి మనము దేవుని కోల్పోయాము. పరలోకాన్ని కోల్పోయాము. మన ఆత్మను కూడ నాశనమార్గమున కోల్పోయాము. వెదకుడి అన్నప్పుడు ఆయన నిత్యమార్గము ఒకటి ఉన్నదని కూడ ఆ మాటలలో మనకు తెలియజేసారు. మనం అగుటయే కాదుగాని దేవుని మార్గాన్ని శ్రద్ధతో వెదకాలి. దానిని మనం గ్రహించుకొని వెదకాలి.

"తట్టుడి మీకు తీయబడునని" ప్రభువు చెప్పారు. మనం వెదకేటప్పుడు త్వరత్వరగా వెదకాలి. మనం వెదికే నిత్యజీవిత మార్గాన్ని త్వరలో, అర్జంటుగా కనుగొనాలి. ఏలయనగా మనం కోల్పోయిన సంగతులు చాల తీవ్రమైనవి. అందువలన

తట్టుడియని ప్రభువు చెప్పుచున్నారు. అతిప్రాముఖ్యమైన అవుసరం ఉన్నవారు వచ్చి మనతలుపు తడతారు. మనం తలుపు తీసేవరకు తడతారు. వారు పట్టుదల గలిగినవారు. అందువలన మనం అడిగే వాటిని పట్టుదలతో అడగాలి. వెదికేవాటిని తీక్షణముగా, సమయం కోల్పోవకుండా వెదకాలి. సరిగదా దేవుని రాజ్యములోనికి లేదా ఆయన సంఘములోనికి మనకు ప్రవేశం లభించే వరకు ఆ రాజ్యపు ద్వారములను మనం తట్టాలి. మనం నిత్యజీవం కొరకు తట్టాలి. అందుకే తట్టుడి, మీకు తీయబడునని ప్రభువు చెప్పారు.

## ఇయ్యబడును, దొరకును, తీయబడును

దీనంతటిలోను యేసుప్రభువు ప్రార్థన చేయుటకు మనలను ప్రోత్సహించుచున్నారు. మీకియ్యబడును, మీకు దొరకును, మీకు తీయబడును అని ఆయన చెప్పారు. ఆయన అందరికి ఉచితముగానే యిచ్చును. ఆయన అందరికి జీవమును ఊపిరిని సమస్తమును దయచేయువాడు (అపొ.కా. 17:25). యూదులకు, అన్యజనులకు, ధనికులకు ధనహీనులకు, విద్యావంతులకు, విద్యాహీనులకు ఆయన తన రక్షణను ఉచితముగా దయచేయువాడు.

దేవుడు మన తండ్రియై యున్నాడు: మనం మన బిడ్డలకు శ్రేష్టమైన మంచి యీవుల నిచ్చుటకు ప్రయత్నం చేయుదుము. ఆ తత్వం మనకు దేవునినుండే వచ్చినది. మనలను ఆయన తన స్వరూపమందు చేసారు. ఆయన పరిపూర్ణుడైన తండ్రి, మనమే చెడ్డవారము. " మీరు చెడ్డవారై యుండియు మీ పిల్లలకు మంచి యీవుల నియ్యనెరిగి యుండగా..." అని ప్రభువు అన్నారు. మనం చెడ్డవారమైనను ప్రాకృతిక స్వభావమువలన మన బిడ్డలు మనలను రొట్టె అడిగితే రాతి నియ్యము, చేపనడిగితే పామునియ్యము. తండ్రిమంచివాడైతే తన బిడ్డలకు అవీ యివీ యిచ్చుటలో ఆనందించును. అట్లయినప్పుడు పరలోకమందున్న తండ్రి తన్ను అడుగువారికి అంతకంటె ఎంతో నిశ్చయముగా మంచి యీవుల నిచ్చును.

తండ్రియైన దేవుడు మన ప్రార్థనలను విని వాటికి జవాబియ్యాలంటే మనం కొన్ని షరతులకు లోబడాల్సియున్నది. "పరలోకమందున్న మీ తండ్రి" అని ప్రభువు

చెప్పినమాటలలో, మొదట మనం ఆయన కుమారులం కావాలనే షరతు ఇమిడి యున్నది.

మనం ఆయనకు విధేయులమైన బిడ్డలము కావాలి. "మరియు మనమాయన ఆజ్ఞలను గైకొనుచు ఆయన దృష్టికి ఇష్టమైనవి చేయుచున్నాము గనుక, మనమేమి అడిగినను అది ఆయన వలన మనకు దొరుకును" అని భక్తుడైన యోహాను వ్రాసాడు (2యోహాను 3:22). మనం ఆయన చిత్తప్రకారము అడగాలి. "ఆయనను బట్టి మనకు కలిగిన ధైర్యమేదనగా ఆయన చిత్తానుసారముగా మనమేది అడిగినను ఆయన మన మనవి నాలకించుననునదియే" (1యోహా 5:14). మనప్రభువు యొక్క తత్వము కూడ అట్టిదే. సిలువ నీడలో యుంటూ, " తండ్రీ సాధ్యమైతే ఈ గిన్నె నాయొద్దనుండి తొలగి పోనిమ్ము, అయినను నాయిష్ట ప్రకారము కాదు, నీ చిత్తప్రకారమే కానిమ్మని" ఆయన ప్రార్థించెను (మత్తయి 26:39).

అంతేకాదు మనం ఆయన నడిగేటప్పుడు క్షమాపణ గుణము గలవారమై అడగాలి. యేసుప్రభువు నేర్పిన మాదిరి ప్రార్థనలో, "మా ఋణస్థులను మేము క్షమించిన ప్రకారము మాఋణములు క్షమించుము" అని నేర్పారు (మత్తయి 6:12). మనుష్యుల అపరాధములను మీరు క్షమించిన యెడల, మీపరలోకపు తండ్రియు మీ అపరాధములను క్షమించును. మీరు మనుష్యుల అపరాధములను క్షమింపకపోయిన యెడల మీ తండ్రియు మీ అపరాధములను క్షమింపడు అని ఆయన చెప్పారు (మత్త 6:14,15).

తరువాత, మనం దేవునికి సన్నిహితంగా యున్న కుమారులమై యుండాలి. "దేవుని యొద్దకు రండి, అప్పుడాయన మీ యొద్దకు వచ్చును" అని పరిశుద్ధాత్ముడు చెప్పుచున్నాడు (యాకోబు 4:8).

అందువలన దేవుడు మనలను వినడానికి ముందు, మనం దేవుని మాటలను వినడానికి ఆసక్తికలిగి యుండాలి. అందువలననే మనం ఆయన అద్వితీయ కుమారుడైన యేసుప్రభువు నందు మనం విశ్వాసముంచాలి, పాపముల విషయమై

మారుమనస్సు పొందాలి, పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మమును పొందాలని ఆయన చెప్పుచున్నారు. ఆయన మాటలను ఈదినం నీవు వింటే, ఈ దినమే లోబడి దేవుని కుమారుడవు కాగలవు!!.

- జాషువా గూటం.

## దేవుడు ఉన్నాడా?

అనాదికాలమునుండి నవనాగరిక ప్రపంచంలో ఉన్న నేటివరకు చాలమందిలో దాగియున్న సంశయాత్మక ప్రశ్నే దేవుడున్నాడా? అనునది. ఆయన ఉంటే ఎలా ఉంటాడు? ఆయనను ఎవరైనా చూచారా? దేవుడున్నాడని మనం ఎలా నమ్మగలం?

ప్రజలలో కొందరు దేవుడు లేడు అనేవారున్నారు. అలాటివారిని నాస్తికులన్నారు. పరిశుద్ధ గ్రంథమైన బైబిలు అయితే "బుద్ధిహీనులు" అని పిలిచింది (కీర్తనలు 14:1; 53:1). అధికజనాభా దేవుడున్నాడని నమ్ముచున్నారు. వీరిని ఆస్థికులని పిలుచు చున్నారు. ఏదో ఒక మానవాతీత శక్తి ఈ సర్వప్రపంచాన్ని నడిపించుచున్నది. దానినే 'దేవుడు' అని పిలుచుచున్నారు. సైన్సు అయితే లేక శాస్త్రవేత్తలైతే దేవుడని వారు ఒప్పుకోరు గాని 'మహాకర్షక శక్తి' ( THE GREAT ATTRACTOR ) అని పిలిచింది.

## దేవుని చూచినవారున్నారా?

అనాది కాలం నుండి మానవుని కోరిక దేవుని చూడాలని. అలాంటి కోరికే మోషేకు కలిగింది. "నాఇల్లంతటిలో నమ్మకమైన వాడు" అని దేవునిచే చెప్పబడిన మోషే దేవుని చూడాలనుకున్నాడు. వెంటనే దేవునిని అడిగాడు. అయితే "ఆయన నీవు నాముఖమును చూడజాలవు, ఏ నరుడును నన్ను చూచి బ్రతుకడనెను" (నిర్గమ 33:20). మరియు మనము క్రొత్త నిబంధనకు వచ్చినట్లయితే ఇలాఉంది "ఎవడును ఎప్పుడైనను దేవుని చూడలేదు" (యోహాను 1:18). "సమీపింపరాని తేజస్సులో ఆయన మాత్రమే వసించుచు అమరత్వము గలవాడై యున్నాడు. మనుష్యులలో ఎవడును ఆయనను చూడలేదు ఎవడును చూడనేరడు" (1తిమోతి

6:16). భౌతికమైన మన నేత్రములు కొంత కాంతిని కొన్ని వస్తువులను మాత్రమే చూడగలవు. ఎక్కువ కాంతిని చూస్తే మన కంటిలో ఉన్న రెటీనా పొర కాలిపోతుంది. ఎవరు సమీపింపరాని తేజస్సు కలిగినవాడు దేవుడు. సూర్యునినే చూడలేని లేక సమీపించని మానవుడు దేవుని సమీపించగలడా? అందుకే దేవునిని మానవులలో ఎవ్వరు చూడలేదని, చూడనేరడని బైబిలు ఖచ్చితంగా చెప్పుచున్నది. "ఏ మానవుడును దేవుని ఎప్పుడును చూచియుండలేదు" (1యోహాను 4:12). ఎవరూ దేవుని చూడనప్పుడు దేవుడున్నాడని ఎలానమ్మగలం ? దేవుడున్నాడని ఎలాచెప్పగలం? ఆలోచించండి. ఎవరూ చూడని దేవుడు ఉన్నాడా?

అవును ఉన్నాడు. ఆయన ఎవరు? బైబిలు ఇలా చెప్తుంది "ఆకాశములకు సృష్టికర్తయగు యెహోవాయే దేవుడు" (యెషయా 45:18). యెహోవాయే దేవుడైతే ఆయన ఉన్నాడని ఎలా చెప్పగలం? "ఎందుకనగా దేవుని గూర్చి తెలియశక్యమైన దేదో అదివారి మధ్య విశదమై యున్నది, దేవుడు అదివారికి విశదపరచెను: ఆయన అదృశ్య లక్షణములు, అనగా ఆయన నిత్యశక్తియు, దేవత్వమును, జగదుత్పత్తి మొదలుకొని సృష్టింపబడిన వస్తువులను ఆలోచించుట వలన తేటపడుచున్నవి" (రోమా 1:19,20) . దేవుని అదృశ్య లక్షణములు అనగా కన్పించడు గాని లక్షణములను బట్టి ఉన్నాడు అని తెలుసుకోవచ్చు. ఉదాహరణకు గాలి ఉంది, మీరు చూచారా? లేదు మరిగాలిలేదా? ఉంది. ఎలా చెప్పగలం? అది మన శరీరమునకు తాకుతుంది, చెట్లుకదులుచున్నవి, మనం గాలి పీల్చుకుంటున్నాము. ఈ లక్షణములను బట్టి గాలి ఉంది అని నమ్ముచున్నాం. అలాగే విధ్యుత్ ఉందా? ఉంది. మీరు చూచారా? లేదు గాని ఉంది అనుటకు లైట్లు వెలుగుచున్నవి, ఫేన్ తిరుగుతుంది అనేక కార్యక్రమములు జరుగు చున్నవి. కాబట్టి విధ్యుత్ ఉంది అని నమ్ముచున్నాం.

అలాగే దేవుడున్నాడా? అవును ఆయన కన్పించకపోయినను ఆయన లక్షణములు, నిత్యశక్తినిబట్టి ఆయన ఉన్నాడని ఆయన కలుగజేసిన వస్తువులను ఆలోచించుట వలన తేటపడుచున్నవి. "ఆయన అదృశ్య లక్షణములు అనగా ఆయన నిత్యశక్తియు, దేవత్వమును, జగదుత్పత్తి మొదలుకొని సృష్టింపబడిన వస్తువులను

ఆలోచించుట వలన తేటపడుచున్నవి" (రోమా 1:20). "జగత్తును అందలి సమస్తమును నిర్మించిన దేవుడు తానే ఆకాశమునకును భూమికిని ప్రభువై యున్నందున హస్తకృతములైన ఆలయములలో నివసింపడు. ఆయన అందరికిని జీవమును, ఊపిరిని, సమస్తమును దయచేయువాడు..... మరియు యావద్భూమి మీద కాపుర ముండుటకు ఆయన ఒకని నుండి ప్రతిజాతి మనుష్యులను సృష్టించి, వారు ఒకవేళ దేవుని తడవులాడి కనుగొందురేమో అని, తన్ను వెదకు నిమిత్తము నిర్ణయ కాలములను, వారి నివాసస్థలముల పొలిమేరలను ఏర్పరచెను" (అపో.కా. 17:24-27).

## దేవుడున్నాడనుటకు అనేక ఋజువులు

"ఆకాశములు దేవుని మహిమను వివరించుచున్నవి, అంతరిక్షము ఆయన చేతిపనిని ప్రచురపరచుచున్నది. పగటికి పగలు బోధచేయుచున్నవి. రాత్రికి రాత్రి జ్ఞానము తెలుపుచున్నవి, వాటికి భాషలేదు, మాటలు లేవు వాటి స్వరము వినబడదు, వాటికొలనూలు భూమియందంతట వ్యాపించి యున్నది. లోకదిగంతముల వరకు వాటి ప్రకటనలు బయలు వెళ్ళుచున్నవి" (కీర్తన 19:1-4) ఈ విశాల విచిత్ర విశ్వంను చూస్తే, దానిని పరిశీలిస్తే, ఆకాశములు, అంతరిక్షము, గ్రహములు, నక్షత్రములు,వాటికదలికలు, వాటిఉనికిని ఆలోచిస్తే వాటి పరిభ్రమణములను గూర్చి తెలుసుకొనుటకు మనజీవిత కాలంచాలదు. వాటిని కలుగజేసినవాడే వాటిని నడిపించుచున్నాడు ఆయన ఎంతగొప్పవాడో అవే చెప్పుచున్నవి. భాషాజ్ఞానము, మాటలు లేని ఈ సృష్టి చెబుతుంది. నేటికి సూర్యుడు సృజింపబడి కోట్ల సంవత్సరములు గడచినను, ఆ సూర్యునిలో కాంతిగాని, వేడిగాని తగ్గలేదు. సూర్యుడే అంతగా ఉంటే సూర్యుని కలుగజేసినవాడు ఎంత గొప్పవాడో ఆలోచించండి.

దేవుడున్నాడా? అవును ఉన్నాడనుటకు ఇవిచాలదా? అయినను మృగములను విచారించుము అవి నీకు బోధించును. ఏమని? దేవుడున్నాడని. ఆకాశపక్షులను విచారించుము అవినీకు తెలియజేయును దేవుడున్నాడని. భూమిని గూర్చి ధ్యానించిన

యెడల అది నీకు బోధించును దేవుడున్నాడని. సముద్రములోని చేపలును నీకు దాని వివరించును. మృగములు ఆకాశపక్షులు, భూమి, చేపలు వీటన్నిటిని బట్టి యోచించిన యెడల యెహోవాను కానలేని వాడెవడు? (యోబు 12:7-9).

దేవుడున్నాడా అవును ఉన్నాడు. ఆయన సృష్టికర్త. సమస్తమును సృజించినవాడు. "యెహోవాయే నిజమైన దేవుడు. ఆయనే జీవముగల దేవుడు" (యిర్మియా 10:10). ఎందుకనగా దేవుని గూర్చి తెలియశక్యమైనదేదో అది వారిమధ్య విశదమై యున్నది. దేవుడది వారికి విశదపరచెను (రోమా 1:19). వారి అవివేక హృదయము అంధకారమాయెను; తాము జ్ఞానులమని చెప్పుకొనుచు బుద్ధిహీనులైరి. సృష్టికర్తకు బదులు సృష్టిని పూజించుచున్నారు. మీరు దేవుడెవరో తెలుసుకొని, సృష్టికర్తయైన ఆ దేవునినే మీ దేవునిగా అంగీకరించి ఆయనకు ప్రియులైన పిల్లలు కావాలని హృదయ పూర్వకంగా కోరుచున్నాను.

- V. చిన్నయ్య కడలి

## ఏ భేదమును లేదు

**( There is no difference )**

పౌలు యూదుల యొక్కయు అన్యజనుల యొక్కయు రక్షణ విషయము మాట్లాడుచు ఏ భేదమును లేదు అని రోమా 3:23లో చెప్పెను. భేదము కల్గిన అనేక విషయములు కలవు. కాని అనేక మందిని గూర్చి బాధ్యత కల్గియుండుకు, కొన్ని విషయములలో ఆలోచించుటకు ఏ భేదమును లేదు. అది మనకు చాలా విలువైనది. విచారములో నున్నవారి ఎడల సానుభూతి చూపుటకు కష్టములలో ఉన్నవారికి సహాయము చేయుటకు మాత్రమే కాక రక్షణను వెదకువారికి సహాయము చేయుటకు తోడ్పడును.

మొదటిగా మానవుని యొక్క భౌతికావసరతలలో ఏ భేదమును లేదు: మానవుడు గొప్పవాడుగాని లేక పేదవాడుగాని, నల్లజాతీయుడు గాని, పెద్దవాడు లేక చిన్నవాడు, హిందూదేశస్థుడు లేక ఆఫ్రికా దేశస్థుడు లేక అమెరికా దేశస్థుడుగాని భౌతికముగా

ఏ భేధము లేదు. మనమందరము కూడా విచారము మరియు సంతోషము ఆశ మరియు నిరాశ, భయము మరియు ధైర్యము, ప్రేమ మరియు ద్వేషము కలిగియున్నాము. ఇవన్నియు ఒకే ప్రమాణములో కలిగియుండక పోయినప్పటికి పై విషయములన్నియు మనకు సాధారణము.

రెండవదిగా లెక్క అప్పగించవలసిన విషయములో పాపము యొక్క నిజస్థితి విషయములో ఏ భేదమును లేదు : రోమా 3:23లో ఈ విధంగా చెప్పబడినది : "ఏభేదమును లేదు అందరును పాపముచేసి దేవుడనుగ్రహించు మహిమను పొందలేక పోవుచున్నారు". మానవజాతికంతటికి క్రీస్తు రక్షకునిగా అవసరము. చాలాసారులు ఈ విధముగా చెప్పుట వినియుందుము. "పాపము పాపమే, పాపములో ఏభేదమును లేదు. దానికొరకై అతడు చనిపోవలసినదే". నిజముగా పాపము పాపమే. కాని ఒకడు తన పాపము విషయమై పశ్చాత్తాపపడక పోయినట్లయితే మరియు పాపక్షమాపణ పొందకపోతే అతడు తన ఆత్మను పోగొట్టుకొనును. నిజమే పాపము యొక్క నిజస్థితి విషయములో ఏభేదమును లేదు. కాని పాపముయొక్క రకాలలోను, పాపముయొక్క ప్రమాణములలోను ఏ భేదము లేదు అనుట సత్యము కాదు. నా పాపములు చిన్నవి, నీ పాపములు పెద్దవని భేదములేదు. కొన్నిసార్లు కొంతమంది ఈ విధముగా ప్రార్థించుట వినియుందుము. "ప్రభువా వారిని వారి పాపములనుండి రక్షించండి. మరియు మా తప్పిదములను, మా అపరాధములను క్షమించండి". నీవి పాపములు, నావి పొరపాట్లు లేక అపరాధములు అని భావించకండి. అయినప్పటికి బైబిలును ఆలోచనా పూర్వకముగా జాగరూకతతో చదువువారు ఏ ఒక్కరును లేరు. పాపములో రకములు మరియు పాపముయొక్క దశలలో భేధములు కలవు. యోహాను 19:11లో యేసు పిలాతుతో ఇట్లనెను. "అందుచేత నన్ను నీకు అప్పగించిన వానికి ఎక్కువ పాపము కలదనెను". స్వనీతిపరులును, వేషదారులును వేశ్యలకంటె హీనమైనవారు అని మత్తయి 21:31 తెలియజేయుచున్నది. పాపమునకు గల శిక్షను యేసు స్పష్టముగా తెలియజేసెను. లూకా 12:47లో ఈ విధముగా చెప్పెను "తన యజమానుని చిత్త మెరిగి యుండియు సిద్దపడక, అతని చిత్తము చొప్పున జరిగింపక యుండు దాసునికి అనేకమైన దెబ్బలు తగులును". మత్తయి 12:38-40లో కొందరిపై నేరస్థాపన చేయబడినట్లు చూపబడినది. ఈ పాఠ్యభాగములోని

ముఖ్యవిషయమేమనగా ఏ భేదమును లేదు అందరూ పాపము చేసినవారే. ఆ పాపము చిన్నదైనను లేక పెద్దదైనను సరే క్రీస్తు రక్తముద్వారా రక్షణను పొంది ఆయన పిలుపును అంగీకరించక పోయినట్లయితే, అది అతని నాశనమునకు కారణమగును.

మూడవదిగా మనలో ప్రతీ ఒక్కరి ఎడల దేవుని యొక్క ప్రేమలో ఏ భేదమును లేదు: ఆయన మనలను అనేక విధములుగా ప్రేమించుచున్నాడు. నీ పాపము ఎంత చెడ్డదైనను సరే నిన్ను ప్రేమించి, నిన్ను రక్షించాలని కోరుతున్నాడు. అట్టి అద్భుతమైన సత్యాన్ని అవగాహన చేసికొనుట చాలాకష్టము. మానవుడు ఆలాగు పడిపోక పోయినట్లయితే దేవుడు ప్రేమింపక పోవును. మరియు అతడు మారుమనస్సు పొంది దేవుని వైపుకు తిరిగి దేవుడు ఉద్దేశించిన మార్గములోనికి తిరిగిన ఆయన అతనిని రక్షించును. “వారి అవివేక హృదయము అంధకారమాయెను. తాము జ్ఞానులమని చెప్పుకొనుచు బుద్ధిహీనులైరి” (రోమా 1:22). “కొందరు ఆలస్యమని యెంచుకొనునట్లు ప్రభువు తన వాగ్దానమును గూర్చి ఆలస్యము చేయువాడు కాదుగాని ఎవడును నశింపవలెనని యిచ్ఛయింపక, అందరును మారుమనస్సు పొందవలెనని కోరుచూ మీయెడల దీర్ఘశాంతము గలవాడై యున్నాడు (2పేతురు 3:9).

నాల్గవదిగా , మానవుల కొరకైన రక్షణ సంకల్పములో ఏ భేదమును లేదు: యోహాను 14:6లో యేసు-“నేనే మార్గమును, సత్యమును, జీవమును. నాద్వారానే తప్ప ఎవడును తండ్రియొద్దకు రాడు” అని చెప్పుటలో వేరే మార్గము లేదు అని స్పష్టపరచెను. “యేసునందు విశ్వసించక పోయినట్లయిన వారువారి పాపముల యందే యుండి చనిపోవుదురు” (యోహా 8:24) అనునది సత్యము. “మీరు మారుమనస్సు పొందని ఎడల మీరందరు ఆలాగుననే నశింతురు” (లూకా 13:3) అనునది సత్యము. “క్రీస్తును ప్రభువని నోటితో ఒప్పుకొనుటకు ఇచ్ఛయింపక పోయినట్లయిన అతనికి రక్షణ లేదు” (రోమా 10:10) అనునది సత్యము. “బాప్తిస్మము మిమ్మును రక్షించును” (1పేతురు 3:21) అనునది మరిసత్యము.

ఈ విషయములను గైకొనకుండా నీవు ఏమిచేసినను దేవుడు అనుగ్రహించు రక్షణను పొందలేవనుటకు ఏ భేదమును లేదు అని నీవు గుర్తించవలెను.

- T. పియర్స్ బ్రౌన్, (VOT)

## దేవుని చిత్తము

### (The Will of God)

"ప్రభువా, ప్రభువా అని నన్ను పిలుచు ప్రతివాడును పరలోక రాజ్యములో ప్రవేశింపడు గాని, పరలోకమందున్న నా తండ్రి చిత్త ప్రకారము చేయువాడే ప్రవేశించును" (మత్త 7:21).

ఈ వాక్య భాగమును బాగుగా పరిశీలించిన యెడల యేసుప్రభువు ఈ మాటలు హిందువులకు, ముస్లిమ్‌లకు, క్రైస్తవేతరులకు గాక కేవలము క్రైస్తవులమని చెప్పుకొని తనను "ప్రభువా, ప్రభువా యని పిలుచు (ప్రార్థించు) వారిని" గూర్చియే చెప్పియున్నాడు. ప్రభువా ప్రభువా యని పిలుచువారు పరలోకరాజ్యంలో ఎందుకు ప్రవేశింపరు? కారణమేమి? మరి ఎవరు ప్రవేశించుదురు? దీనికి జవాబు పై వాక్యమందే విశదపరచియున్నాడు. "నా తండ్రి చిత్త ప్రకారముచేయువాడే" ప్రవేశించునని. తండ్రి చిత్తప్రకారము కాక తమ స్వ చిత్తానుసారముగా ప్రార్థించువారు లేక చేయువారు పరలోకంలో ప్రవేశింపరని తేటపరచియున్నాడు. "లోకమును దాని ఆశయు గతించి పోవుచున్నది గాని, దేవునిచిత్తమును జరిగించువాడు నిరంతరము నిలుచును" (1యోహా 2:17). కనుక మనమేమి చేసినను దేవుని చిత్తాను సారముగా చేయవలెను.

ఒకే మంద:- యేసుప్రభువు ఈ లోకంలో వున్నప్పుడు యిట్లు చెప్పెను. "ఈ దొడ్డివిగాని వేరే గొర్రెలు నాకు కలవు, వాటిని కూడ నేను తోడుకొని రావలెను, అవి నా స్వరము వినును, అప్పుడు మంద ఒకటియు గొర్రెలకాపరి ఒకడును అగును. నేనుదాని మరలా తీసికొనునట్లు నా ప్రాణము పెట్టుచున్నాను; ఇందువలననే నా తండ్రి నన్ను ప్రేమించుచున్నాడు" (యోహా 10:16, 17). ఈ వాక్యములో

ఒకేమంద అని చెప్పుటలో మంద ఒకటేగాక, రెండుగాని, అంతకంటె ఎక్కువగాని వున్నట్లు అర్థమగుచున్నది గదా? నిజముగా అప్పుడు రెండే రెండు మందలు ఉన్నవి. అవి : 1. ఇశ్రాయేలు జనాంగము 2. అన్య జనాంగము. రెండుమందలు "ఒకేమంద" కావలెనని దేవుని చిత్తమై యున్నది . అది తన అద్వితీయ కుమారుని ద్వారా జరుగుట దేవుని నిత్య సంకల్పమైయున్నది (ఎఫె 3:8-11). అందువలన యేసు ప్రభువు సిలువపై తన ప్రాణమును అర్పించి ఈ రెండు మందలను ఏకము చేసెను. ఈ సందర్భమున ఆనాటి ప్రధాన యాజకుడు కయప పలికిన మాటలు కూడా గుర్తుచేసి కొనుట మంచిది. "యేసు ఆ జనము కొరకును, ఆ జనము కొరకు మాత్రమే గాక చెదరి పోయిన దేవుని పిల్లలను ఏకముగా సమకూర్చుటకును చావనైయున్నాడని ప్రవచించెను" (యోహా 11:52). అపోస్తులుడైన పౌలు ఎఫెసీ సంఘమునకు వ్రాయుచు యిట్లు చెప్పెను. "అయినను మునుపు దూరస్థులైన మీరు ఇప్పుడు క్రీస్తు యేసునందు, క్రీస్తురక్తమువలన సమీపస్థులై యున్నారు. ఆయన మనసమాధానమై యుండి మీకును మాకును ఉండిన ద్వేషమును, అనగా విధిరూపకమైన ఆజ్ఞలు గల ధర్మశాస్త్రమును తన శరీరమందు కొట్టివేయుటచేత మధ్యగోడను పడగొట్టి మన ఉభయులను ఏకము చేసెను. ఇట్లు సంధిచేయుచు ఈ యిద్దరిని తనయందు ఒక్క నూతన పురుషునిగా సృష్టించి తన సిలువవలన ఆ ద్వేషమును సంహరించి దాని ద్వారా వీరిద్దరిని ఏకశరీరముగా చేసి.... సమాధాన సువార్త ప్రకటించెను" (ఎఫె 2:13-17). ఈ వాక్యమందుగల ప్రధానమైన రెండు అంశములు మాత్రం పరిశీలిద్దాం.

1. ఉభయులను ఏకము చేయుట :- అనగా రెండు మందలుగా ఉన్నవారిని ఏకము చేసి ఒకే మందగా చేయుట దేవుని చిత్తమై యున్నది. 2. ఏకశరీరముగా చేయుట:- అనగా తన సిలువవలన ... వీరిద్దరిని ఏక శరీరముగా చేసెను. శరీరము అనగా సంఘము. "ఆ సంఘము ఆయన శరీరము" (ఎఫె 1:23). ఆ సంఘము ఏ సంఘము? ఆ సంఘము దేవుని నిత్య సంకల్పమునైన సంఘము. (ఎఫె 3:8-11). ఆ సంఘము యేసుక్రీస్తుచేత వాగ్దానము చేయబడిన సంఘము (మత్త 16:18). ఆసంఘము తన స్వరక్తమిచ్చి సంపాదించిన తనసంఘము (అపొ.కా. 20:28).

ఆసంఘము రక్షణ యిచ్చు నామము గల సంఘము (అపొ.కా. 4:12). అది క్రీస్తు సంఘము (రోమా 16:16). ఆ సంఘములు ఎన్నిఉన్నవి? ఈ విషయమై పరిశుద్ధాత్ముడు యిట్లు చెప్పుచున్నాడు; "శరీరము ఒక్కటే, ఆత్మయు ఒక్కడే, ఆ ప్రకారమే మీ పిలుపు విషయమై ఒక్కటే నిరీక్షణ యందుండుటకు పిలువబడితిరి. ప్రభువుఒక్కడే, విశ్వాసము ఒక్కటే బాప్తిస్మమొక్కటే అందరికీ తండ్రియైన దేవుడు ఒక్కడే" (ఎఫె 4:4,5). మతశాఖలవారు ఈవాక్యమును బట్టి ప్రభువు ఒక్కడే, విశ్వాసమొక్కటే, బాప్తిస్మము ఒక్కటే, తండ్రియైనదేవుడు ఒక్కడే యని గంభీరమైన ప్రసంగాలు చేస్తారు; కాని, "శరీరమొక్కటే" యను విషయాన్ని మాత్రం విస్మరిస్తారు; విసర్జిస్తారు. కారణం? శరీరమొక్కటేయనగా సంఘముఒక్కటే, అది క్రీస్తు సంఘమై యున్నది. వారు సంఘమునకు వెలుపల వున్నారు గనుక సంఘమును గూర్చి బోధించరు. ప్రభువు ఒక్కడే యను సంగతి ఎంత ప్రాముఖ్యమో సంఘముకూడా అంత ప్రాముఖ్యము గలది. ఏలయన?.... ఆ సంఘము సత్యమునకు స్తంభమును మూలాధారమునై యున్నది (1తిమో 3:15). ఇది దేవుని చిత్తము. ఇట్టి దేవుని నిత్యసంకల్పమునకు, ఆయన చిత్తప్రకారము స్థాపించబడిన క్రీస్తు సంఘమునకు వెలుపల యుండి ప్రభువా, ప్రభువా యని పిలిచిన ఎట్లు పరలోకరాజ్యంలో చేరగలరు? క్రీస్తును నమ్మి బాప్తిస్మము పొందుట ద్వారా ఆయన సంకల్పమైన సంఘములో చేరి ప్రార్థించిన పరలోక రాజ్యంలో చేరగలరు.

- జి . మార్కు, నందిగామ.

Basic Bible Course

The Director
Bible Correspondence Course
P. O. Box 80, Kakinada - 533 001

# సంక్షిప్త వార్తలు

అక్టోబరు 30వ తేదీ బుధవారం పశ్చిమగోదావరి జిల్లా కొమ్మరలో జరిగిన సువార్త కూటములో జాషువాగూటం గారు వాక్యపరిచర్య చేసిరి. ఆరోజు 8మంది క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. కొమ్మరలో Y. ప్రభుదాస్ గారు చక్కని పరిచర్య చేయుచున్నారు.

నవంబరు 3వ తేదీ ఆదివారం జాషువాగారు విశాఖపట్టణం దయాల్‌నగర్‌లోను గంగవరంలోను యున్న క్రీస్తు సంఘాలలో వాక్యపరిచర్య చేసిరి. దయాల్‌నగర్‌లో సోదరులు P.సెల్వరాజ్ గారు, గంగవరంలో S.R. కవితాగారు క్రీస్తుకొరకు మంచిపని చేయుచున్నారు.

నవంబరు 6వతేదీన సంభవించిన పెనుతుఫాను ఉభయగోదావరి జిల్లాలలో భీభత్సాన్ని సృష్టించింది. సస్యశ్యామలమైన కోనసీమకు సంభవించిన నష్టం ఎవరూ అంచనా వేయలేనిది. ఉప్పెన, పెనుగాలులకు వేలకొలది ప్రజలు చనిపోగా వేలాది మంది క్షతగాత్రులయ్యారు, 95 శాతం కొబ్బరిచెట్లు పూర్తిగాను, పాక్షికంగాను దెబ్బతిన్నాయి. బలుసుతిప్ప గ్రామవాసులలో 50 శాతంమంది మరణించడం శోచనీయం. విద్యుచ్ఛక్తి, సమాచార వ్యవస్థ చిన్నాభిన్నమై వెంటనే పునరుద్ధరణకు వీలులేనంత ఘోరంగా దెబ్బతిన్నాయి. 210 కి.మీ వేగంతో వీచిన పెనుగాలులు రీయిన్‌ఫోర్స్‌డ్ కాంక్రీటు సిమెంటు భవనాలకు కూడ నష్ట కలుగజేసాయంటే సామాన్యగృహాలు ఎలా ఉన్నాయో ఊహించవచ్చు.

అనేకమంది సహోదరులు గృహాలను, ఆస్తులను, ప్రార్థనామందిరాలను కోల్పోయారు. సోదరి మేరీరత్నం గూటంగారు (పాల్‌గూటం గారి సతీమణి) తుఫానులో మరణించగా ఆమె జ్ఞాపకార్థ కూటము 23వ తేదీ శనివారం జరిగెను. ఉభయ గోదావరి జిల్లాలనుండి అనేక మంది సువార్తికులు, రక్తసంబంధులు, ఆప్తులు, స్నేహితులు మరియు జాషువాగూటం దంపతులు హాజరై పాల్‌గూటం గారి కుటుంబమునకు, ఓదార్పును ఆదరణను కలుగజేసిరి. ఆయనకు అయిదుగురు కుమార్తెలు, యిద్దరు కుమారులు ఉన్నారు.

గృహాలను కోల్పోయి ఆపదలలోనున్న క్రైస్తవులకు సోదరులు జాషువాగూటం గారు సకాలంలో సహాయపడిరి అందరికీ NEWS LETTERS వ్రాసి వారి క్షేమ-

సమాచారమును తెలిసికొనిరి. నవంబరు 22వ తేదీన చినలంకలో జరుగవలసి యున్న సువార్తికుల సదస్సు తుఫాను మూలముగ వాయిదా పడింది. వారు నిర్మించుకొనిన మందిరము ప్రతిష్టకు ముందే నేలమట్టమయింది.

కాకినాడ సత్యవాణి బిల్డింగ్ కిటికీ అద్దములు మాత్రమే పగిలినవి. స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ విద్యార్థులు క్షేమంగా ఉన్నారు. జాషువాగారు పిల్లలు క్షేమంగా ఉన్నారు. ఆఫీసులోని పని యథావిధంగా జరుగుచున్నది. తుఫాను మిగిల్చిన విషాదఛాయల నుండి సోదరులు కోలుకొనగలుగునట్లు ప్రార్థించుదాం. విజయవాడ దుర్గాపురం క్రీస్తు సంఘస్థులు తుఫాను బాధితుల సహాయార్థం వెయ్యిరూపాయలు, ఒక బస్తాబియ్యం, క్రొత్త నిబంధన గ్రంథములు రాజ్‌కుమార్‌గారి ద్వారా పంపించారు. మణిపూర్ క్రీస్తు సంఘములు 4400/- రూ॥లు పంపిచారు. పలురాష్ట్రములనుండి, దేశములనుండి టెలిఫోన్లు, ఉత్తరాల ద్వారా సోదరులు తుఫాను బాధితులను గూర్చిన వివరణ తెలిసికొను చున్నారు. ఈ పత్రిక ముద్రించుసరికి థాయ్‌లాండ్‌లో ఏషియన్ బైబిలు లెక్చర్‌షిప్‌లో ప్రసంగించుటకు గాను సోదరులు జాషువాగూటంగారు సతీసమేతముగా బయలుదేరుచున్నారు. డిశంబరు 8నాటికి వారు కాకినాడ చేరుకొందురు.

---

**Regd. No. H/ KD-45/ K.D. H.O**

**Date of Posting : 15 th of Every month**

**From:**

**SATYA WAKKU**
**P.O. Box 80**
**KAKINADA - 533 001**

**To**